ప్రజాశక్తి

శుక్రవారం 19 మే 2023

5

అల్లూరి సీతారామరాజు



కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

జిల్లా కార్మిక శాఖ అధికారి టి.సుజాత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కార్మికులకు వేసవిలో ఎండ తీవ్రత నుండి రక్షణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కార్మిక శాఖ జిల్లా అధికారి సుజాత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నెలకొన్న నేపథ్యంలో తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సేవా రంగాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, నిర్మాణరంగం, ఇటుకల పరిశ్రమలు, కర్మాగారాలలో యాజమాన్యాలు తగిన వేసవి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ సూచనలు అమలు చేసి కార్మికులకు పని వేళలు ఉదయానికి, సాయంత్రానికి మార్పు చేయాలన్నారు. పని చేసే ప్రాంగణంలో తాగునీటి సదుపాయాలు, తగిన నీడ సౌకర్యాలు కల్పించాలన్నారు. వేడి గాలులు, వడ దెబ్బ తగలకుండా నియంత్రణ పదార్థాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులలో వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో వైద్య సేవలు అందించాలని చెప్పారు. వడదెబ్బ తగిలినపుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన ఔషధాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచి కార్మికులకు అందించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని..

నేటి నుంచి శానిటేషన్ కార్మికుల సమ్మె

కనీస వేతనం చెల్లించాలి : సిఐటియు



ఆందోళన చేపడుతున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యల పరిష్కారం కోసం అల్లూరి జిల్లా పాడేరు డివిజన్లోని ప్రభుత్వ ఆస్పత్రుల శానిటేషన్ కార్మికులు ఈనెల 19 శుక్రవారం నుంచి తమ విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతున్నారు. ఈ నెల 3న పాడేరులో నిర్వహించిన కార్మికుల జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో పాడేరు, అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు ఆస్పత్రులలో పనిచేసే శానిటేషన్ కార్మికులు, అధిక సంఖ్యలో హాజరై 19 నుంచి సమ్మె చేపట్టేందుకు నిర్ణయించి ఆసుపత్రుల యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసిన సంగతి విదితమే. గత 15 రోజుల వ్యవధిలో తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కానరాక పోవడంతో కార్మికులంతా సమ్మె చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు పాడేరు డివిజన్లోని నాలుగు ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో పని చేస్తున్న సుమారు 56 మంది శానిటేషన్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టనున్నారు. ఆస్పత్రుల కార్మికులు చేపట్టే సమ్మెను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎల్ సుందర్రావు మాట్లాడుతూ, ఆస్పత్రుల శానిటేషన్ కార్మికుల వేతన సమస్యల పరిష్కారంపై వైద్య విధాన పరిషత్ అధికారులు శ్రద్ధ చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అనేకసార్లు కార్మికుల వేతన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు. సమ్మె నోటీస్ ఇచ్చినప్పుడు కూడా అధికారులకు విన్నవించామని, స్పందన కరువైందన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ.16 వేల వేతనం చెల్లించాలని, కొన్ని ఆసుపత్రుల్లో కార్మికులకు రూ.10,700, మరికొన్ని ఆసుపత్రుల్లో 9,500 చొప్పున చెల్లిస్తున్నారని తెలిపారు. పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించలేదని విమర్శించారు. నేటి నుంచి కార్మికులు చేపడుతున్న సమ్మెతోనైనా అధికారులు స్పందించి వారి వేతన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా కార్మికులకు కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, వైద్య విధాన పరిషత్ ద్వారా జీతాలు చెల్లించి, ప్రతి ఆస్పత్రిలో సరిపడా సిబ్బందిని నియమించి కార్మికులపై పని భారం, పని ఒత్తిడి తొలగించాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి కార్మికుల జీతాలు పెంచలేదని, ఈ నాలుగేళ్లలో అన్ని నిత్యావసర ధరలు రెట్టింపు అయ్యాయని దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి కార్మికుడికి నెలకు రూ.16000 జీతం చెల్లించాలన్నారు. ప్రతినెల సక్రమంగా వేతనాలు చెల్లించి, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆగని శిశు మరణాలు



మృతి చెందిన శిశువు

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూతవేటు దూరంలో బుధవారం రెండు నెలల శిశువు మృత్యువాత పడింది. మండల కేంద్రంలోని దాలిగుమ్మడి గ్రామంలో సమరెడి వెంకటరావు వెంకటలక్ష్మి దంపతుల ద్వితీయ కుమార్తె పుట్టిన రెండు నెలల చిన్నారి తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో మృతి చెందింది. ఇదిలా ఉండగా గతకొద్ది రోజులుగా మండలంలోని మట్టుజోరు పంచాయతీ గ్రామంలో తుర్రే బాలకృష్ణ, వసంత దంపతుల మూడు నెలల పాప మృతి చెందింది. గత నెల ఏప్రిల్ 6న మండల కేంద్రంలోనే బల్జెని నీలకంఠ చిన్నారి దంపతులకు పుట్టిన చిన్నారి తీవ్రమైన కడుపునొప్పి, ఊపిరి సక్రమంగా అందక ఆకస్మికంగా మృతి చెందింది. ఇదే కుటుంబానికి చెందిన తన సోదరుడైన బి.సాయి కుటుంబానికి జన్మించిన మరొక శిశువు రెండు నెలల కిందట మృత్యువాత పడ్డాడు. మండలంలో ఐదు రోజుల వ్యవధిలో సుమారు ఆరు గురు పసిపిల్లలు మృత్యువాత పడటం గమనార్హం. చిన్నారుల మరణాలపై సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తూ చర్యలు తప్పకుండా కలెక్టర్ హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని పలువురు విమర్శించారు. శిశు మరణాలపై అధికారులు ప్రత్యేక అధ్యయనం చేసి అరికట్టేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

-శిశు మరణాల నియంత్రణ ఏది?

ఏజెన్సీ ప్రాంతంలో శిశుమరణాలు అధికంగా జరుగుతున్నా చర్యలు చేపట్టక పోవడం విచారకరమని బాలల హక్కుల పరిరక్షణ వేదిక అల్లూరి జిల్లా కన్వీనర్ బాకా లవకుశ తెలిపారు. శిశుమరణాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. శిశు మరణాలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వెంకట్

ఉపాధి హామీని రక్షించుకుందాం

సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి- చింతూరు

ఉపాధి హామీ పథకాన్ని పోరాటాల ద్వారా రక్షించుకుందామని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. మండలంలోని తుమ్మల గ్రామంలో గురువారం ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధి పని చేస్తున్న కూలీలకు వేసవిలో మజ్జిగ, టెంట్లు, మంచినీళ్లు కల్పించేవారని, పని ముట్లుకు డబ్బులు, ప్రయాణఛార్జీలు ఇచ్చేవారిన తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి కూలీలకు కనీసం కూలి రేట్లు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.600 కూలి చెల్లించాలని, మజ్జిగ, టెంట్లు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల గ్రామ ఉపాధి కూలీలు మొట్టం రాజయ్య, సోడి దుర్గారావు, పాపారావు, కిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు ఉద్యమం

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర



ర్యాలీ చేపడుతున్న గిరిజన సంఘం నేత సురేంద్ర, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు గిరిజనుల్ని సంఘటితం చేసి ఉద్యమాల్ని ఉధృతం చేస్తామని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర తెలిపారు. గిరిజన సంఘం అల్లూరి జిల్లా 8వ మహాసభలు పాడేరు జిల్లా కేంద్రంలో గురువారం విజయవంతంగా జరిగాయి. ఈ మహాసభలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలుకై గిరిజన సంఘం నిర్వహించే పోరాటాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం అమలు చేయాలని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని, గిరిజన సంస్కృతి కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనరస మాట్లాడుతూ, జూన్ 8, 9 తేదీల్లో గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు అరకువేలిలో జరగనున్నాయని, ఈ మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులపై చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని గిరిజన సంఘం నిర్మిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తూ ఎపి అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలని, అటవీపాలసీ విధానం రద్దు చేసి, జీవో 3రే చట్టబద్ధం కల్పించాలన్నారు. గిరిజన మాతృ భాష విద్య వాలంటీర్లను రెగ్యులర్ చేసి, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షుడు లక్కు, జిల్లా నాయకులు నరసయ్య, ఎంఎం శ్రీను, టి.సూర్యనారాయణ, కుమారి, కొండలరావు, కృష్ణారావు, సర్బు నాయుడు, ఎల్.సుందరరావు, నారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

హైకోర్టు స్టే ను అమలు చేయాలి

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పల నర్స

ప్రజాశక్తి పాడేరు :- వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై హైకోర్టు స్టే ఇచ్చినా నిర్మాణ పనులు చేయడం కోర్టు ధిక్కరణ కింద వస్తుందని, స్టే ను అమలు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. పాడేరు మండలంలో వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయించిన భూమిని అప్పలనర్స గురువారం పరిశీలించారు.కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మాణ పనులు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన భూ బాధిత కుటుంబాలతో కలిసి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనర్స విలేకరులతో మాట్లాడుతూ, 1/70 చట్టాన్ని దిక్కరించి వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయింపు చేయడం అన్యాయమన్నారు. హైకోర్టు స్టే విధించినా వైసిపి ఆఫీస్ నిర్మాణానికి స్థలంలో పనులు నిలుపుదల చేయకపోవడంపై భూ బాధిత కుటుంబాలు పనులు జరిగే చోటకు వెళ్లి పనులు నిలుపుదల చేయాలని కోరితే మీ దిక్కు ఉన్న చోట చెప్పుకోమని చెప్పడం సరికాదన్నారు. న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉంటే తక్షణమే వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి కేటాయించి స్థలంలో పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. సుందరరావు, మండల అధ్యక్షుడు ఎస్.చిట్టి బాబు, సత్తిబాబు, కొండలరావు పాల్గొన్నారు.



పనులు అడ్డుకుంటున్న అప్పలనర్స, గిరిజనులు




మెటల్ తేలిపోయి ఉన్న రహదారిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తాగునీరు, రహదారుల సమస్యలపై దృష్టి పెట్టండి

సిపిఎం నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, రహదారులు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలపై ప్రభుత్వం, అధికారులు దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని కుందులూరు, ములకనపల్లి, బుల్లెట్ వాడ, సున్నంమట్కా తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా కుందులూరు, సున్నంమట్కా, తెల్లవారిగూడెం, గుర్రంపేట గ్రామాల్లో తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నా అధికారులు కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు కూడా దాహం తీర్చే పరిస్థితి లేదన్నారు. గుల్లేటివాడ గ్రామంలోనూ అదే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని తక్షణమే అన్ని పంచాయతీల్లో తాగునీటి పథకాలను పునరుద్ధరించి నీటి ఎద్దడిని నివారించాలని, రోడ్లు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జగనన్నకు చెబుదాం దేని కోసమని, ఎమ్మెల్యేలు గడిచిన నాలుగేళ్లలో ఏజెన్సీలో రోడ్లు వేశారా? తాగునీరు అందించారా? రైతు పొలాలకు చెక్ డాములు కట్టారా? ఏమి చేశారని, జగనన్నకు చెబుతారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు చేసిన అన్యాయం గురించి చెబుతారా? భూముల లాక్కున్నామని చెబుతారా? బోయ వాల్మీకి, బొంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చి గిరిజన బిడ్డల రిజర్వేషన్ను అమ్ముకున్నామని చెబుతారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, శ్రీరామ్మూర్తి, లక్ష్మణరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.




పొక్లయినర్తో తొలగిస్తున్న నిర్మాణం

దుకాణాల తొలగింపు

అరకొర పరిహారంపై ఆందోళనలో బాధితులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో జోరుగా గత రెండు రోజుల నుంచి దుకాణాల తొలగింపు చేపడుతున్నారు. పరిహారం చెల్లించిన దుకాణదారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి దుకాణ సామాగ్రిని తరలింపు చేసుకోవాలని ఆదేశాలిస్తూ తొలగింపునకు జాతీయ రోడ్డు నిర్వాహక అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రెండు రోజుల నుంచి తొలగింపు పనులు ప్రారంభించారు. కొంతమందికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించగా మరి కొంతమందికి అరకొరగా పరిహారం చెల్లించారు. దీంతో, అరకొరగా పరిహారం అందిన గిరిజన బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చదువుకున్న స్థానిక నిరుద్యోగ యువత జీవనోపాధి కోసం దుకాణాలు పెట్టుకుని కుటుంబాలను పోషిస్తున్నారు. దుకాణాలను తొలగిస్తుండగా పరిహారం అరకొరగా చెల్లించడంతో ఆర్థికంగా నష్టపోయామని బాదిత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నష్టపోయిన బాధిత గిరిజనులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆందోళన చేపడుతున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

బిజెపి ఎంపీని అరెస్ట్ చేయాలి

సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పాడేరు: రెజ్లర్ల పై లైంగికంగా దాడి చేసిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ను తక్షణం అరెస్టు చేయాలని ప్రజాసంఘాల పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో గురువారం సిఐటియు, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రేజర్లపై దాడి చేసిన బిజెపి ఎంపీని అరెస్టు చేయాలని గత కొంతకాలంగా ఢిల్లీలో పెద్ద ఎత్తున క్రీడాకారులు ఆందోళన నిర్వహిస్తున్నా బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తుందని విమర్శించారు. మహిళపై జరిగిన దాడిని బిజెపి మహిళా ఎంపీలు, మన రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం, వైసిపి ఎంపీలు ఖండించకపోవడం విచారకరమన్నారు. గతంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అనేక దాడులు జరిగినా బిజెపి పట్టించుకోలేదని విమర్శించారు.పైగా బిజెపి నాయకులు అమ్మాయిల్ని అత్యాచారం చేసి జైలుకు వెళ్లి వచ్చిన వారికి కూడా సన్మానాలు చేసిన ఘనత బిజెపికి ఉందని హెద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కేశవ, గిరిజన సంఘం నాయకులు పోతురాజు, ప్రభుదాసు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల అభివృద్ధికి చర్యలు

పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య



మాట్లాడుతున్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - రంపచోడవరం

పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన గిరిజన బాధితులను అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన గిరిజన బాధితుల పొలాలు అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, వివిధ రకాలైన వ్యాపారాలు చేసుకొనుటకు రుణాలు మంజూరు తదితర అంశాలపై గురువారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్తో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన సుమారు 5,800 గిరిజన కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. భూమికి భూమి ఇవ్వడం జరుగుతుందని, ఆ భూముల్లో రైతులు నచ్చిన పంటలు వేసుకునే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. గిరిజనులు ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ఉన్న వారికి ఉపాధి హామీ పనులు కల్పిస్తామన్నారు. ఈ భూములకు సాగునీరుఉన్నది లేనిది పరిశీలించి సర్వే చేసి నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రైతుల ఆసక్తి మేరకు విత్తనాలు సరఫరాకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. పిడిఎఫ్ 5వేల కుటుంబాలకు నిధులు వచ్చాయని, అర్హులైన గిరిజనులను రీ సెటిల్మెంట్లు చేస్తామని చెప్పారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఐటీడీఏ పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి వ్యవసాయం సాగు చేయడానికి ఏమి కావాలో సర్వేలో తెలుసుకొని నివేదికల సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, డిపిఎం పరమేశ్వరరావు, ఎడిఎలు సిహెచ్కెవి చౌదరి, కె.సావిత్రి, అగ్రికల్చరల్ అధికారి ఎల్.రాంబాబు. ఏపీఈపీడీసీఎల్ డిఇ ఎ.వెంకటేశ్వరరావు, ఎఇ.దొరబాబు, ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్, తహశీల్దార్లు శ్రీధర్, అనసూయ, డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో రత్నకుమారి, ఉపాధి ఏపీవోలు, వెలుగు ఎపిఎంలు, హార్టికల్చర్, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

పలు చోట్ల నేలకొరిగిన చెట్లు

ప్రజాశక్తి మారేడుమిల్లి

కొన్ని రోజులుగా ఎండ వేడికి తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో గురువారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. మారేడుమిల్లి గ్రామం సోమిరెడ్డి పాలెం వీధిలో కనకదుర్గమ్మ గుడి సమీపన ఉన్న భారీ వృక్షం గుడి మీద కూలిపోవడంతో రేకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దానికి అనుకొని ఉన్న కరెంటు తీగలు తెగిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో ప్రజలు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందించి కరెంట్ పునరుద్ధరణ చేశారు. రెండు వారాలుగా ఎండ వేడిమికి జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.



ఈదురుగాలులకు నేలకొరిగిన భారీ వృక్షం

22న వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - రంప చోడవరం : రంపచోడవరం మండలం, ఐ.పోలవరం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు టిటిడి ఎగ్జిక్యూటివ్ అధికారి ఏవి ధర్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 22న సోమవారం దీనిని ప్రారంభిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 17 నుండి 21వ తేదీ వరకు మహా సంప్రోచన ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22న ఆలయం ప్రారంభం అనంతరం సాయంకాలం ఐదు గంటల నుండి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-అడ్డతీగల

మండలంలోని తిమ్మాపురం గ్రామం వాల్మీకి పేటలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు బాధిత కుటుంబాలను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి గురువారం పరామర్శించారు. తక్షణ సాయం కింద బియ్యం, కూరగాయలు, బట్టలు, దుప్పట్లో, వంట సామాగ్రి, నగదు అందజేశారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మద్దాల వీర్రాజు, ఎల్లవరం సొసైటీ అధ్యక్షులు తోట రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఫకీర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- పెదబయలు :మండల కేంద్రంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరిగే మోదకొండమ్మ జాతర సందర్భంగా ఆర్‌జిఎస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. స్థానిక సర్పంచి పి.మాధవరావు, ఎంపీటీసీ కె.బొంజుబాబులు మాట్లాడుతూ, చదుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో 30 టీమ్ లు పాల్గొంటున్నాయని, ప్రధమ విజేతలకు రూ.30 వేలు, ద్వితీయ రూ.15 వేలను అందించనున్నామని, క్రీడాకారులు నియమ నిబంధనలు పాటించి, యూనిపాం ధరించాలని నిర్వాహకులు కోరారు.

ఆర్‌టిసి బస్సులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:గతంలో మారుమూల గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం తిప్పిన ఆర్టీసీ బస్సులను మళ్లీ ఆ గ్రామంలో పునరుద్ధరించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి.దయానిధి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాలకు సుమారు 20 ఆర్టిసి బస్సులను గతంలో ప్రభుత్వం నడిపేదన్నారు. ప్రస్తుతం నడపకపోవడంతో మారుమూలు ప్రాంత గిరిజనుల రవాణా సౌకర్యానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి బస్సులను పునరుద్ధరించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి,జె వెంకట్ బాబు, పి.నరసయ్య జి రఘు తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలాట ఆడుతున్నచిన్నారులు

చిన్నారులకు మ్యూజికల్ చైర్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో వేసవి సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం చిన్నారులకు కుర్చీ ఆటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత, సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొమర్రాజు జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యాన తెలుగు భాష, సాహిత్య, చరిత్ర పరిశోధనా పితామహుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కొమర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, కొమర్రాజు శక్తిగా మారి భాష, సాహిత్యం, చరిత్ర శోధన కోసం కృషిచేశారని తెలిపారు. పద్నాలుగు భాషలలో పాండిత్యం సంపాదించడమే గాక శాసనాలను పరిశోధించి పరిష్కరించిన గొప్ప మేధావి అని కొనియాడారు.

మండుటెండల్లో మన్యం

ఎండ వేడిమితో అల్లాడుతున్న జనం



నిర్మానుష్యంగా పాడేరు-అరకు ప్రధాన రహదారి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పరిధిలో గత వారం రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పాడేరు-అరకు, పాడేరు-చోడవరం ప్రధాన రహదారులపై గురువారం జనాలు లేక వెలవెల బోయాయి. పట్టణంలో ఉదయం 9 గంటల నుంచే భానుడు ప్రతాపంతో 4 గంటల వరకు వేడిగాలుల ప్రభావం కొనసాగింది. ఎండ వేడిమి ఉండటంతో బయటకు రావాలంటే భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు. మే మాసం కావడంతో 40 డిగ్రీల పైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తిపోతున్నారు. మండుటెండవేళ అత్యవసరం అయితే తప్ప బయటకు రాలేదు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు గొడుగులు, తువ్వాళ్లను ఉపయోగించుకున్నారు. ఊహించని రీతిలో ఎండ తీవ్రత ఉండడంతో ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. ఈ ఎండకు తగిన రక్షణ లేకుండా బయట తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

డుంబ్రిగూడ:సూర్య భానుడి ప్రతాపానికి మండలంలో సుమారు వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా మండుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో స్థానిక మండల ప్రజలు బయటికి వెళ్లలేక ఇంటికి పరిమితం అవుతున్నారు. ఏవైనా అత్యవసర పనులు ఉంటే ఉదయం లేక సాయంత్రం చేసుకుంటున్నారు. మధ్యాహ్నం సమయంలో కొంతమంది చెట్టు నీడన లేక వాగుల్లో స్నానాలు చేస్తూ సేద తీర్చుకుంటున్నారు. గురువారం మండలంలో ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. బయట తిరిగి సమయంలో కొంతమంది న్యూస్ పేపర్లను తలకు అడ్డం పెట్టుకొని తిరగగా, మరి కొంతమంది గొడుగులు, కట్చీప్‌లు పెట్టుకొని మండల కేంద్రంలో తిరుగుతున్న దృశ్యాలు కనబడ్డాయి.



ఎండలో నడిచి వెళుతున్న వ్యక్తి

ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలి

పోలీస్ కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలని, ప్రజాతంత్ర ఉద్యమాలపై కొంత మంది పోలీసు అధికారులు అక్రమ కేసులు, బైండ్‌ఓవర్ కేసులు బనాయిస్తున్నారని, ఇది భావ్యం కాదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు తదితర ప్రతినిధి వర్గం గురువారం నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ్‌వర్మకు వినతి పత్రం అందించారు. సిఐటియు ప్రజాతంత్రంగా కార్మికులు, ప్రజల హక్కుల కోసం పోరాడే నిజాయతీ, చిత్తశుద్ధి కల్గిన యూనియన్ అని, ఎటువంటి చట్ట వ్యతిరేకమైన, అవినీతికరమైన, ద్రోహపూరితమైన చర్యలకు పాల్పడదని వినతి పత్రంలో పేర్కొన్నారు. అటువంటి కార్మిక నాయకులపైనా, కార్యకర్తలపైనా కొంత మంది పోలీసు అధికారులు అక్రమ కేసులు బనాయించి, తహశీల్దార్ వద్దకు తీసుకువెళ్ళి రూ.లక్షకు బైండ్‌ఓవర్ కేసులు బనాయిస్తున్నారని, ఇది అన్యాయమని, రాజ్యాంగం, సహజ న్యాయసూత్రాలకు భిన్నమైనదని పేర్కొన్నారు. ఈ విషయంపై నగర పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈనెల 3న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన గళం వినిపిస్తే, విశాఖలో 24 మంది కార్యకర్తలపై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కేసులు బనాయించారని తెలిపారు. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకునేందుకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వెళ్తే నలుగురు నాయకులు, కార్యకర్తలపైన కేసులు పెట్టారన్నారు.

క్లాప్ డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 జీతం అమలుచేయాలని కోరుతూ ఈ నెల 12న యూనియన్ నాయకులు లేబర్ ఆఫీస్‌కి వెళ్లారని, పోలీసులే దగ్గరుండి జెసిఎల్ దగ్గరకు తీసుకెళ్లారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. అయినా నాలుగు రోజుల తరువాత అంటే 16వ తేదీన పోలీసులు సుమారు 30 మందిపై అన్యాయంగా కేసులు బనాయించారని తెలిపారు. మరుసటి రోజు జివిఎంసి వద్ద తాము ధర్నా చేస్తుంటే ఇద్దరికి నోటీసులు ఇచ్చారన్నారు. సుమారు 49 మందిపైన కేసులు బనాయించారని, బైండ్‌ఓవర్ కేసులు పెట్టారని వివరించారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి కేసులు బనాయించలేదన్నారు.

ముఖ్యమంత్రి వైజాగ్ వచ్చినప్పుడు సిఐటియు ఎటువంటి పిలుపులు ఇవ్వనప్పటికీ ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం చేస్తున్నారని, నాయకుల ఇళ్లకు కానిస్టేబుళ్ల రాత్రులు వెళ్లి ఇళ్ళలో కూర్చుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయాలపై నగర పోలీస్ కమిషనర్ తగు విచారణ జరపాలని కోరారు. వాస్తవ పరిస్థితిని ఆలోచించి సిఐటియు నాయకులు, కార్యకర్తలపై మోపిన కేసులను ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు.



సీపీ త్రివిక్రమ్‌వర్మకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం

కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న కెవిపి చంద్రమౌళి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్వదేశీయత పేరిట కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గంగిగోవు లాంటి ప్రభుత్వ రంగాన్ని అమ్మడం ద్వారా నిజమైన దేశద్రోహానికి పాల్పడుతోందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటామన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 777వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్మికులు, నాయకులు కూర్చున్నారు. శిబిరం వద్ద ఏర్పాటుచేసిన కళాఖండాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వై.రాజు మాట్లాడుతూ ప్రయివేటు రంగంలో, దళితులు, మైనారిటీలకు రిజర్వేషన్లు ఉండవన్నారు. ప్రతి ఇంటిలో ఒకరో, ఇద్దరో ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, అటువంటి వారికి ఉపాధి రావాలన్నా ఉద్యోగ అవకాశాలు కలగాలన్నా ప్రభుత్వ రంగంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. అటువంటి ప్రభుత్వ రంగాన్ని నాశనం చేసేందుకు, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు మోడీ ప్రభుత్వం కృషిచేస్తోందని విమర్శించారు. ఈ చర్యలను దళిత సంఘాల ఐక్యతతో ఎదుర్కొంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, జోన్ కార్యదర్శి జి.ఈశ్వరరావు, ముఠా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు, డివైఎఫ్ఐ నాయకులు కె.గణేష్, కె.సంతోష్‌కుమార్, ఎం.ఈశ్వరరావు, ఎన్.ఎర్రిబాబు, డివిడి రాజు, మదీనా తదితరులు పాల్గొన్నారు.

21న అఖిల భారత ఆదివాసీ జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : గిరిజనులపై పెరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులతో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.రామ్మోహన్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల భూమిని, జీవనోపాధిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడం, విస్తాపనలేని అభివృద్ధిని, అడవులను రక్షించుకోవడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 21న డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, బీహార్, యుపి, త్రిపుర, మణిపూర్ నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-కొయ్యూరు

రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రాజేంద్రపాలెంలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగ్యలక్ష్మి పాలొన్నారు. 242 గడపలను ఆమె సందర్శించి వారితో మాట్లాడారు. ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారానికి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రేగడి ముసలినాయుడు, స్థానిక సర్పంచ్ పీఠ సింహాచలం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అచ్యుత్, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, నాయకులు సడ్డ సావిత్రి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి ఒరిగిన భారీ వృక్షం

ఎప్పుడు కూలిపోతుందో తెలియని వైనం

భయాందోళన చెందుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో చెక్‌పోస్టు సమీపంలో ప్రధాన రహదారిపైకి భారీ వృక్షం ఒరిగిపోయి ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. పెను ప్రమాదం పొంచి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఏపీ జెన్కో చెక్‌పోస్టు సమీపంలో సీలేరు నుండి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో ఈ భారీ వృక్షం ఒరిగిపోయి ఎదురుగా అవతిల వైపు ఉన్న చెట్టు కొమ్మలపై పడి, వాటిని ఆనుకొని ఉంది. భారీ గాలులు వీచినా, వర్షాలు కురిసినా చెట్టు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ రహదారి గుండా నిత్యం వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. వాహనాలు వచ్చే సమయంలో చెట్టు కూలిపోయి వాహనాలపై పడితే భారీ ప్రాణ నష్టం జరుగుతుందని పలువురు భయాందోళన చెందుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులుగాని, అటవీశాఖ అధికారులుగాని ప్రమాదం జరగక ముందే తక్షణమే స్పందించి రహదారికి అగడ్డంగా ఒరిగిపోయిన వృక్షాన్ని తొలగించి ఎవరికి ఎటువంటి ప్రాణం నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



రోడ్డుపైకి వాలిపోయిన భారీ చెట్టు

జిఒ31 రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజలపై ఆర్థిక భారాలు వేసే జిఒ 31 వెంటనే రద్దు చేయాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామనమూర్తి డిమాండ్ చేశారు గురువారం అక్కయ్యపాలెం జంక్షన్‌లో రాష్ట్రవ్యాప్తంగా గూడ్స్ లారీలు, ప్రైవేటు బస్సులు, వ్యాన్లు కార్లుపై భారీగా పన్నులు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 31 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామనుమూర్తి మాట్లాడుతూ ప్రైవేట్ మోటార్ వాహనాలపై భారీగా పెంచిన పన్ను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పథకం కింద ప్రైవేటు ఫైనాన్సర్ దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని లారీలు కార్లు జీపులు వ్యానులు కొనుగోలు చేసి,. ప్రజలకు సేవలు అందిసూ, ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తూ జీవనోపాధి పొందుతున్న వాహన యజమానులకు డ్రైవర్లకు క్లీనర్లకు బతుకును దుర్భరం చేయడం తగదని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిలు, పెట్రోలు, గ్యాస్ ధరలు, జిఎస్‌టి పన్నులతో రవాణా రంగం కుదేలవుతున్న తరుణంలో ఆదుకోవలసిన ప్రభుత్వాలే ఇలా పన్నులు పెంచుతూ ఆర్థిక భారాలు వేయడం సమంజసం కాదన్నారు.జిఒ 21 రద్దుచేయకుంటే, ప్రజాగ్రహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రైవేటు మోటారు వాహనాలపై పెంచిన పన్నుల భారం పరోక్షంగా ప్రజలపై పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం ఏకపక్షంగా పన్నులు పెంచుతూ విడుదల చేసిన జిఒలు 21,31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావి కృష్ణ కె.శివ, కె.రాము, జి శ్రీను అప్పలరాజు పాల్గొన్నారు

పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి వాచ్ బహూకరణ



వాచ్‌ను బహూకరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన కుడుముల సుజనకు గురువారం గిరిజన సంక్షేమ శాఖ అధికారి హాసిని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.శాంతిమతి చేతుల మీదుగా వాచ్‌ను బహూకరించారు.

గత నెలలో ఫుడ్ కమిటీ చైర్మన్ విజయప్రతాపరెడ్డి అడ్డతీగలలోని గిరిజన పాఠశాలలను సందర్శించిన సందర్భంలో 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సంపాదించిన విద్యార్థికి రూ.1500 విలువైన వాచ్‌ను బహూకరిస్తామని చెప్పారు. ఈ మేరకు వాచ్‌ను సుజనకు అందజేశారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం డివిజన్‌లోని 7 మండలాల పంచాయతీ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో డివిజనల్ స్థాయి సమీక్షా సమావేశం డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్‌ఎన్‌వి రాఘవన్ గురువారం నిర్వహించారు. ఇంటి పన్నులు వసూలు, పంచాయతీ రికార్డుల నిర్వహణ, గ్రామ పంచాయతీ ప్రాపర్టీ రిజిస్టర్ తయారు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్‌లు సక్రమంగా నిర్వహణ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌లో భాగంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన ఆధ్వర్యంలో జూ పార్కులో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. జూ పార్కుకు వచ్చే సందర్శకులకు జూ ఎడ్యుకేషన్ బృందం సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సుస్థిరత గురించి సందర్శకులకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలి..

ప్రజాశక్తి -ములగాడ : పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులు ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని విశాఖపట్నం సర్కిల్ - 1 సహాయ కార్మిక కమిషనర్ ఎస్ మోహనలక్ష్మి పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించారు. పరిశ్రమలు, నిర్మాణరంగ సంస్థల యజమానులు ఉదయం, సాయంత్రం వేళల్లో పని గంటల మార్పు, పని ప్రాంగణంలో తగిన తాగునీటి సదుపాయం, వడదెబ్బకు గురికాకుండా ఒఆర్ఎస్, ఐస్ ప్యాక్స్, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంచడం, అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద పనిచేసే కార్మికులకు తగిన రక్షణ కల్పించడం, కూల్డ్ రూఫ్, విండోషాడో వంటి సహజపద్ధతులను పరిశ్రమలలో అనుసరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

20న సమ్మర్ కల్చరల్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -కంచరపాలెం : బొట్ట నరసింహారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం బిఎన్ఆర్ భవనంలో ఈ నెల 20న, శనివారం సాయంత్రం సమ్మర్ కల్చరల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బిఎన్ఆర్ భవనంలో కరాటే, కంప్యూటర్, విసిసి టైలరింగ్ కోర్సులలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో పాటు కంచరపాలెం ప్రాంతంలో ఉన్న కళాకారులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఔత్సాహికులు, కళాభిమానులు, స్థానికులు పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు సర్వే నెంబరు 97లో రాధాకృష్ణా కల్యాణమండపం సమీపంలో గెడ్డ అంచున్న నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. చినగదిలి ఆర్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నట్టు అందిన సమాచారం మేరకు, తహశీల్దార్ ఆదేశాలతో పనులను అడ్డుకున్నారు.

ప్రభుత్వ బోర్డును తొలగించి మరీ అక్రమ నిర్మాణం...

తోటగరువు, గణబాబు నగర్ సర్వే నెంబరు 55లో కొండను తొలిచి అక్రమంగా నిర్మాణం చేపడుతున్న స్థలంలో ఇది వరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ బోర్డును పాతారు. అధికారులు పాతిపెట్టిన బోర్డును తొలగించి నిర్మాణం చేపట్టడంతో తహశీల్దారు ఆదేశాల మేరకు అడ్డుకున్న రెవెన్యూ అధికారులు, ఆదేశాలను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎంఆర్ఐ హెచ్చరించారు.

బాల సదనంలో ప్రవేశానికి వచ్చే నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్వహణలో స్థానిక చిన బజారులో ఉన్న బాలసదనంలో ప్రవేశానికి జూన్ 30 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ కె ప్రమీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు బాల సదనంలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893514460, 9848524446 మొబైల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలిక మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వైకుంఠపురం గ్రామం సమీపంలో ఈ నెల 15న బైకును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన చేబ్రోలుకు చెందిన గూడూరు ప్రవళిక(12) కాకినాడ జిజిహెచ్‌లో గురువారం మృతి చెందినట్లు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ గురువారం తెలిపారు. సంఘటనలో కొప్పు శెట్టి త్రినాధ రాజా రమేష్ (25) అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రవళిక కుడికాలు దెబ్బతినడంతో జడ్డంగి పీహెచ్సీలో వైద్యాధికారి సుజీ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైనవైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ బాలిక చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు.



మృతి చెందిన ప్రవళిక

పిడుగుపాటుకు దుక్కిటెద్దులు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని ఉరుములతో కూడిన భారీ వర్షంతో పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృత్యువాతకు గురైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కోనపురం పంచాయితీ బొందుగుడ గ్రామానికి చెందిన పూజారి డొంబు అనే గిరిజన రైతుకు చెందిన రెండు దుక్కిటెద్దులు మృతి చెందాయి. అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లి పశువులు వర్షం కురవడంతో ఆ సమయంలో మామిడి చెట్టు కిందకు చేరాయి. ఆ సమయంలో చెట్టు మీద పడిన పిడుగు పాటుకు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు. దుక్కెటెద్దులు మృతి చెందడంతో రైతు లబోదిబో మన్నాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.